చిరంజీవి వివరణతో.. వాస్తవాలు బట్టబయలు

- అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండించిన చిరంజీవి
- జగన్ తమను అవమానించలేదని స్పష్టం
- ప్రజలకు నిజాలు తెలిశాయంటున్న వైఎస్సార్ సీపీ నేతలు

ద్వారకాతిరుమల: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అహంభావం, అహంకారంతో ఇటీవల అసెంబ్లీలో మాజీ సీఎం జగన్, సినీ హీరో చిరంజీవిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలతో పాటు మరి కొందరు ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. బాలకృష్ణ మాట్లాడిన మాటలు ఉద్దేశపూర్వకంగా, కుట్ర పూరితంగా ఉన్నాయని, చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందంటున్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలను వెంటనే ఖండించిన చిరంజీవి వాస్తవాలను హుందాతనంగా బయటపెట్టారని అంటున్నారు. తమ పట్ల జగన్ మర్యాద పూర్వకంగా వ్యవహరించారని చిరంజీవి స్వయంగా చెప్పడం ఇప్పుడు హాట్ టాపిగ్గా మారింది. అయితే తన అన్నను, సినీ నటులను జగన్ అవమానించారని ఎన్నికల ప్రచారాల్లో పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటల్లో వాస్తవం లేదని ప్రజలు తెలుసుకున్నారు. బాలకృష్ణ తాగి వాగిన వాగుడు కారణంగానే వాస్తవాలు బయటపడ్డాయని అంటున్నారు. వెంటనే అసెంబ్లీ ఆవరణలో ఆల్కహాల్ బ్రీత్ ఎనలైజర్స్‌ను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

నిజాలు బయటకొచ్చాయి



బాలకృష్ణ తాగి వాగడం వల్ల అసెంబ్లీ సాక్షిగా నిజాలు బయటకొచ్చాయి. అసెంబ్లీలో ఎటువంటి పరుష పదజాలాలు వాడకూడదని నీతులు చెప్పే చంద్రబాబు, లోకేష్, కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదు. మెంటల్‌గాడు మాట్లాడిన మాటలకు సభాపతి నవ్వడం సిగ్గుచేటు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మాజీ సీఎం జగన్‌పై అసందర్భ ప్రేలాపనలు చేస్తే చూస్తూ ఊరుకోం.

– బిరుదుగడ్డ చల్లారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి

పవన్ కల్యాణ్ సంజాయిషీ ఇవ్వాలి



సినిమా టికెట్ల ధరలపై చర్చించే సమయంలో జగన్ తన అన్నను, సినీ నటులను అవమానించారని, చేతులు జోడించి వేడుకునేలా చేశారని పవన్ ఎన్నికల ప్రచారాల్లో నోటికొచ్చినట్టు మాట్లాడారు. ఇప్పుడు బాలకృష్ణ వ్యాఖ్యల కారణంగా చిరంజీవి తమను జగన్ అవమానించలేదని స్పష్టం చేశారు. దీనిపై పవన్ ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలి.

– షేక్ మస్తాన్ బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శి

చిరంజీవి నిజాలు తెలియజేశారు



సినీ హీరో చిరంజీవిది పెద్దమనిషి తత్వం. అందుకే బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన ఆరోపణలను హుందాగా ఖండించారు. ప్రజలకు నిజాలు తెలిసేలా చేశారు. దాంతో బాలకృష్ణను చెప్పుతో కొట్టినట్టయ్యింది. అయినా బాలకృష్ణ వ్యాఖ్యలు తప్పని సభాపతి గాని, ప్రభుత్వం గాని, టీడీపీ వారు గాని ఎందుకు చెప్పడం లేదు.

– పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి

ఆర్చరీ పోటీల్లో విజేతలకు అభినందనలు



ఆర్చరీ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల బృందం

చింతలపూడి: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ఈ నెల 26న నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల ఆర్చరీ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు యూనివర్సిటీ ఆర్చరీ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన యూనివర్సిటీ జట్టు గురుకాసి యూనివర్సిటీ పంజాబ్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.అంజద్ ఆలీ ఆదివారం తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ డా.అంజద్ ఆలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు అభినందించారు.

మురుగులో వేట



గ్రంథాలయం రోడ్డులోని డ్రెయినేజీలో విలువైన వస్తువుల కోసం గాలిస్తున్న బాలురు

ద్వారకాతిరుమల: కొన్ని ప్రాంతాల్లో వజ్రాల వేట జరుగుతుందని మనం విన్నాం. ద్వారకాతిరుమలలో ఇదే తరహాలో కొందరు బాలలు విలువైన వస్తువుల కోసం డ్రెయినేజీల్లో వేట మొదలు పెట్టారు. చేటతో మురుగును పట్టి అందులో గాలిస్తున్నారు. యాత్రా స్థలం కావడంతో లాడ్జిలు, సత్రాల్లోని గదుల్లో ఉండే భక్తులు, అలాగే గృహాల్లోని వారు పోగొట్టుకునే చిన్నచిన్న బంగారు, వెండి వస్తువులు డ్రెయినేజీల్లో కొట్టుకెళ్తాయని వీరు భావిస్తున్నారు. అందుకే ఈ నలుగురు బాలలు ఆదివారం స్థానిక గ్రంథాలయం రోడ్డులోని డ్రెయినేజీలో ఇలా వెదుకులాడుతూ కనిపించారు.

క్లుప్తంగా

హనుమద్ హోమం



మద్దిలో నిర్వహిస్తున్న హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమంను ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ దీక్షాదారులు ఆంజనేయస్వామిని దర్శించుకుని హోమ క్రతువులో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఆర్‌వీ చందన పర్యవేక్షించారు.

కొయ్యలగూడెం విద్యార్థికి రాష్ట్రస్థాయి పతకం



మధురశ్రీని అభినందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి చపక్ తక్రా పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి మూడో స్థానంలో నిలిచినట్లు వీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ స్వామి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు బీఆర్ ఒలింపియాడ్‌లో ఏర్పాటుచేసిన గేమ్స్‌లో ఇంటర్ విద్యార్థిని పాకా దుర్గా మధురశ్రీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించిందన్నారు. దీంతో జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని మధురశ్రీని పలువురు అభినందించారు.

గుర్రం జాషువాకు నివాళి



గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అమరావతిలో గుర్రం జాషువా విగ్రహం ఏర్పాటు చేయటంతో పాటు ఆయన జన్మించిన గుంటూరు జిల్లా వినుకొండలో స్మారక మందిరం నిర్మించాలని బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గ్రంథాలయంలో గుర్రం జాషువా 150వ జయంతి కార్యక్రమం లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కులరహిత సమాజం కోసం జాషువా నిరంతరం తన రచనల ద్వారా కృషి చేశారని తెలిపారు. నేటి యువత ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అని అన్నారు.

గండిగూడెం సమస్యలు పరిష్కరించాలి



గండిగూడెంలో గ్రామస్తుల ఆందోళన

టి.నరసాపురం: మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న గండిగూడెంలో ప్రధాన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం గ్రామంలో ఆందోళన నిర్వహించారు. సామాజిక కార్యకర్త ఎస్‌డినా సర్ పాషా మాట్లాడుతూ 30 ఏళ్లుగా గండిగూడెం గ్రామానికి చెందిన ప్రధాన రహదారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామంలో ఎక్కువ శాతం సీసీ రోడ్లు లేవని, డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు బయటకు వెళ్లక దోమలు ప్రబలుతున్నాయన్నారు. దీంతో విషజ్వరాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే గండిగూడెం సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొరివి శేషారావు, కొరివి నాగేశ్వరరావు, పొదిల రామారావు, బడుగు రాఘవులు, సత్తెనపల్లి నరసయ్య, యాదాల వెంకన్న, చక్రాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల్లో నత్తల ఉనికి లేదు



రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖాధికారి

ద్వారకాతిరుమల: ఉద్యాన పంటల్లో ప్రస్తుతం ఆఫ్రికన్ జాతి నత్తల ఉనికి లేదని, రైతులు ఎవరైనా వాటిని గుర్తిస్తే వెంటనే తమకు తెలియజేయాలని మండల ఉద్యానశాఖాధికారి అమర్నాథ్ సూచించారు. ఐఎస్ రాఘవాపురం, సీహెచ్ పోతేపల్లి, తిమ్మాపురం, పంగిడిగూడెం, గుణ్ణంపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన సిబ్బందితో కలసి ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. చాలా రకాల ఆఫ్రికన్ జాతి నత్తలు ఉద్యాన పంటలను ఆశిస్తాయని, వాటి ద్వారా నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఈ నత్తల ఉధృతి ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఉంటుందన్నారు. రైతులు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లారీ యూనియన్ నూతన కమిటీ నియామకం

కుక్కునూరు: సీఐటీయూ అనుబంధ లారీ యూనియన్ సమావేశం యూనియన్ కార్యాలయంలో నిర్మల వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లారీ అండ్ మినీ వ్యాన్, టాటా ఏసీ, బొలెరో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీ నియామక ప్రక్రియను చేపట్టారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా యర్నం సాయికిరణ్, అధ్యక్షుడిగా గంజి రాంబాబు, కార్యదర్శిగా ఎండీ వలీపాషా, కోశాధికారిగా ఒగిరాల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కొప్పెర శ్రీను, కార్యదర్శులుగా నిర్మల వెంకటేశ్వరావు, విశ్వేశ్వరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



శ్యామలకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, కలరాయునగూడెం సర్పంచ్ చల్లగుళ్ల రవిబాబు తల్లి శ్యామల ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, పలువురు నాయకులు ఆదివారం రవిబాబు నివాసానికి వెళ్లి ఆయన తల్లి శ్యామలకు నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు తపనా చౌదరి, బీజేపీ ఏలూరు జిల్లా పార్లమెంటు కన్వీనర్ కె కృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు రాజానాయన, కొల్లి అనీల్ కుమార్, ఆళ్ల సతీష్ చౌదరి, చలగుళ్ల సూరిబాబు తదితరులు రవిబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సందడి

బుట్టాయగూడెం:జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఉలవల ఆంజనేయస్వామిని అభినందించారు.

డిజిటల్ బుక్‌తో రెడ్ బుక్‌కు చెక్



కొయ్యలగూడెంలో డిజిటల్ బుక్ స్కానింగ్ ఆవిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పోలవరంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ స్కానింగ్ విధానంతో అరాచకాలు చేస్తున్న కూటమి నేతల గుండెల్లో ఇక డిజె సౌండ్ పలకనుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు నూకల రాము ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద డీజే బుక్ స్కానింగ్ ఆవిష్కరణ కార్యక్రమం పార్టీ శ్రేణులతో కలసి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పాలన మొదలైంది మొదలు వైఎస్సార్‌సీపీ శ్రేణులనే లక్ష్యంగా చేసుకొని చేస్తున్న దాడులు అమానుషం అని అన్నారు. దత్తపుత్రుడు తయారుచేసిన రెడ్ బుక్‌కి డిజిటల్ బుక్ దీటైన సమాధానం ఇస్తుందని అంతవరకు పార్టీ శ్రేణులు ఓపికతో వ్యవహరించి తిరిగి మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, మండల కో కన్వీనర్ బిరుదుగడ్డ ప్రేమ్ కుమార్, పార్టీ నాయకులు గంటా శ్రీను, చిటికెన శ్రీను, కంభంపాటి బుజ్జిబాబు, మారిశెట్టి శ్రీను, ఘంటసాల శ్రీనమ్మ, సంకుకొండ, దూలపల్లి కాంతారావు, ఏలేటి భాస్కర్, సీహెచ్ రవి, జె.బాబ్జి, టి.వాసు, జె.పట్టియ్య, ఎస్కే నాగూర్, వై.భాస్కర్, జి.సాయి, కె.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ

పోలవరం రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ అన్నారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో డిజిటల్ బుక్‌ను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన వెబ్ పోర్టల్‌లు ఫిర్యాదు చేయవచ్చని, ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయవచ్చన్నారు. కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలకు తగిన విధంగా బుద్ధి చెప్పాలని డిజిటల్ బుక్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాచండీ.. పాహిమాం



విశేషాలంకరణలో ద్వారకాతిరుమలలో కుంకుళ్లమ్మ



కొయ్యలగూడెం మండలం యర్రంపేటలో కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ



యర్రంపేటలో గ్రామోత్సవం చేస్తున్న భవానీలు



బుట్టాయగూడెంలో గుబ్బల మంగమ్మతల్లి



జంగారెడ్డిగూడెంలో 516 రకాల వంటకాలతో వాసవీ మాతకు నైవేద్యం సమర్పణ



ద్వారకాతిరుమలలో లలితా దేవిగా వాసవీ మాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు దుష్టులను సంహరించే మహాచండీ అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆయా ప్రాంతాల్లో అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్నారు. ద్వారకాతిరుమల క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ శ్రీ మహా చండీ దేవిగా దర్శనం ఇవ్వగా ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. బుట్టాయగూడెం గుబ్బల మంగమ్మతల్లిని రూ.1, రూ.10 కాయిన్స్‌తోపాటు నిమ్మకాయల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొయ్యలగూడెం మండలం యర్రంపేటలో భవానీలు కలశాలతో గ్రామోత్సవం చేస్తూ దుర్గమ్మ శరణ ఘోష చేశారు. జంగారెడ్డిగూడెంలో గ్రామదేవత గంగానమ్మ, నూకాలమ్మ, వాసవీ కన్యాపరమేశ్వరి అమ్మవారు, కనకదుర్గమ్మ అమ్మవార్లు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 516 రకాల నైవేద్యాలు సమర్పించారు. ముత్యాలమ్మ కాత్యాయనిగా పూజలందుకుంది. గుర్వాయిగూడెం అయ్యప్ప ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రామచంద్రపురంలోని కోదండ రామాలయంలో లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. వేగవరంలో మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యదర్శి షేక్ గౌస్

కుక్కునూరు: గత మూడు నెలలుగా గోదావరి వరదలతో పొలాలు నీట మునిగి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా డివిజన్ కమిటీ సమావేశం కుక్కునూరు పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ, గతేడాది మిర్చి సాగు చేసిన విలీన రైతులకు పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది రైతులను గోదావరి వరద రూపంలో కోలుకోలేని దెబ్బతీసిందని వాపోయారు. వరదతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదలతో పనుల్లేక పస్తులుంటున్న కూలీలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో ప్రజాపంథా డివిజన్ కమిటీ కార్యదర్శి సోయం చందర్‌రావు, మండల పార్టీ కార్యదర్శి కంగాల కల్లయ్య, డివిజన్ కమిటీ సభ్యులు షేక్ హుస్సేన్, పెంకె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటం ఆదర్శనీయం



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కుక్కునూరు: దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం విప్లవవీరుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను సీపీఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ భగత్‌సింగ్ పోరాటం మరవలేనిదని, ఆయన చూపిన దేశభక్తిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సారంగి శౌర్య, మండల కమిటీ సభ్యులు ప్రేమ్‌సాగర్, లక్కీ, మహేష్, రాము, ప్రదీప్ పాల్గొన్నారు.

కామవరపుకోట: విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ టీవీఎస్ రాజు యువతకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి. సత్యనారాయణ, గుమ్మడి లక్ష్మీనారాయణ, గోలిమే బాల యేసు, టి.రావులమ్మ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య సేవలు



కొయ్యలగూడెంలో సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మానవత సంస్థ ఆధ్వర్యాన ఆదివారం సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం వీఎస్ఎన్ కళాశాలలో నిర్వహించారు. హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సిద్ధ ఆయుర్వేద వైద్యులు చింతల జగదీష్, బీహెచ్ శ్రీనాథ్ సుమారు రెండు వందల మందికి సిద్ధ ఆయుర్వేద చికిత్సను అందించి ఔషధాలు పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సిద్ధయోగ ఆయుర్వేద బొమ్మ మోహన్ వైద్యం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అద్దేపల్లి అంజిబాబు, స్వాతి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. గోదావరి డయాగ్నోస్టిక్ ల్యాబ్, రాజమండ్రి రాయల్ హాస్పటల్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

చింతలపూడి: పట్టణంలో స్థానిక సుబ్బరాజు హైస్కూల్లో కాకర్ల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం శ్రీకృష్ణ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు బి కృష్ణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ కాకర్ల వెంకటేశ్వరరావు వైద్య వత్తిలో ఎందరో పేదలకు సహాయం చేశారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు.